

మాట్లాడుతున్న ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్

# ప్రజలకు మేలు చేసే కేసీఆర్‌ను గెలిపిద్దాం

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 20 : ప్రజలకు మేలు చేసే కేసీఆర్‌ను గెలిపిద్దామని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్ అన్నారు. సోమవారం కుకునూరుపల్లి మండలం తిప్పారంలో సర్పంచ్ కర్రె లక్ష్మీరాజయ్య, ఎంపీటీసీ హరితాసంతోష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆకుల భద్రప్పతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలే భారీ మెజార్టీతో గెలిపిస్తాయన్నారు. కాంగ్రెస్, బీజేపీలను నమ్ముకుంటే మన పరిస్థితి అధోగతే అని విమర్శించారు. కార్యక్రమంలో సర్పంచులు బచ్చలి మహిపాల్, కిరణ్‌కుమార్‌చారి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు చరణ్, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, ఇరసాల కరుణాకర్, ఈశ్వరప్ప, రాములు పాల్గొన్నారు.

# గజ్వేల్‌లో ప్రజాతీర్పు ఏకపక్షమే



18వ వార్డులో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి

గజ్వేల్ అర్బన్, నవంబర్ 20 : గజ్వేల్‌లో ప్రజాతీర్పు ఏకపక్షమేనని గజ్వేల్– ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జి పాతూరి సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం గజ్వేల్ 18వ వార్డులో రోడ్‌షో భాగంగా కార్యకర్తలు, మహిళలతో కలిసి డ్యాన్స్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధితోపాటు ప్రజా సంక్షేమ పథకాలు ఇంటింటికీ చేరాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారన్నారు. ముఖ్యంగా రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్‌తో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. నిరంతరం విద్యుత్, ఇంటింటికీ తాగు, సాగునీరు, విశాలమైన రహదారుల నిర్మాణంతో గజ్వేల్ ప్రజల కష్టాలు తొలిగిపోయాయని చెప్పారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతోపాటు అభివృద్ధి, సంక్షేమంలో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందన్నారు. గజ్వేల్‌లో ప్రజాతీర్పు ఏకపక్షమేనని, సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో ప్రజలు మూడోసారి గెలిపిస్తారన్నారు. మంత్రి హరీశ్‌రావు రోడ్‌షోను విజయవంతం చేసిన ప్రజలకు మున్సిపల్ చైర్మన్ రాజమౌళి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్సీ సంతోష్, నాయకులు విష్ణు, భిక్షపతి, మల్లేశం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## వీధులన్నీ గులాబీమయం

గజ్వేల్ అర్బన్, నవంబర్ 20 : గజ్వేల్ –ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో సోమవారం నిర్వహించిన మంత్రి హరీశ్‌రావు రోడ్‌షోతో గల్లీగల్లీలో గులాబీదండు గుప్పుమన్నది. ఆయా వార్డుల కౌన్సిలర్లు, వార్డు అధ్యక్షులు, మల్లన్నసాగర్ ఆర్అండ్ఆర్ కాలనీవాసులు, ఆయా గ్రామాల్లో మహిళలు, పార్టీ శ్రేణులు భారీ ర్యాలీగా తరలివచ్చారు. దీంతో వీధులన్నీ గులాబీమయంగా మారాయి.



6వ వార్డు నాయకులు, కార్యకర్తలతో తరలివస్తున్న కౌన్సిలర్ రజిత



ఆర్అండ్ఆర్ కాలనీ వేములఘాట్ నుంచి తరలివస్తున్న మహిళలు, నాయకులు



5,17 వార్డుల నుంచి కౌన్సిలర్లు ఆధ్వర్యంలో తరలివస్తున్న పార్టీ శ్రేణులు

# జయశంకర్ బాటలోనే కేసీఆర్..

- తెలంగాణ తొలి సీఎం.. గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆరే
- తొలి స్పీకర్ విశ్వకర్మ మధుసూదనాచారి
- గజ్వేల్‌ను అభివృద్ధి చేసిన కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- గజ్వేల్‌లో విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం



గజ్వేల్ : ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్ అర్బన్, నవంబర్ 20 : ప్రొఫెసర్ జయశంకర్ చూపిన బాటలో సీఎం కేసీఆర్ నడిచి 14 ఏండ్లు ఉద్యమం చేసి తెలంగాణ సాధించారని ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సోమవారం గజ్వేల్ పట్టణంలోని వైష్ణవి గార్డెన్స్‌లో విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మలంతా సీఎం కేసీఆర్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారు. అనంతరం సభకు హాజరైన మంత్రి హరీశ్‌రావుకు మద్దతు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ సూచించిన నీళ్లు, నిధులు, నియామకాలతో కూడిన సిద్ధాంతాన్ని సీఎం కేసీఆర్ నమ్మి 14 ఏండ్లు ఉద్యమం చేసి తెలంగాణను సాధించారన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆశయ సాధనకు కేసీఆర్ అనునిత్యం కృషి చేస్తూ రాష్ట్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారన్నారు. అలాంటి జయశంకర్‌సార్‌ను పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అవమానించారన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు తెలంగాణ ఉద్యమంలో మొదట లేవని, మధ్యలో ఎవడో తెచ్చాడంటూ జయశంకర్‌సార్‌ను రేవంత్‌రెడ్డి తీవ్రంగా అవమానించారన్నారు. ఉద్యమం అంటే తెలియని వాళ్లు, దేశం అంటే గౌరవం లేని వాళ్లు ఇలాగే మాట్లాడతారని చెప్పారు. గజ్వేల్‌లో ఏనాడూ సమస్యలు పట్టించుకోని కాంగ్రెస్, బీజేపీ నాయకులు.. ఇప్పుడు ఓట్ల కోసం గజ్వేల్‌లో తిరుగుతూ తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీలకు గజ్వేల్‌లో ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. ఇన్నిరోజులు గజ్వేల్‌కు భారీగా నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తుంటే వారు జీర్ణించుకోలేదని, ఇప్పుడు గజ్వేల్‌లో ఏ మొహం పెట్టుకుని ఓట్లు అడుక్కోవడానికి వచ్చారన్నారు. సీఎం కేసీఆర్ గజ్వేల్‌లో రైల్వేలైన్, పాండవుల చెరువు అభివృద్ధి, ఐవోసీ భవనాలు, ఎడ్యుకేషన్ హబ్, సమీకృత మార్కెట్, దవాఖానలు, గురుకులాలు, రహదారులను నిర్మించి ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. అభివృద్ధిలో గజ్వేల్‌ను సీఎం కేసీఆర్ వందేండ్లు ముందుకు తీసుకెళ్లారని చెప్పారు.

**గజ్వేల్‌కు దేశవ్యాప్తంగా గుర్తింపు..**

కేసీఆర్ గజ్వేల్‌కు ఎమ్మెల్యేగా ఉండడం ఇక్కడి ప్రజల అదృష్టమని, కేసీఆర్‌తోనే గజ్వేల్‌కు దేశవ్యాప్తంగా గుర్తింపు లభించిందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ తొలి సీఎం గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ అయితే, తొలి స్పీకర్ విశ్వకర్మ మధుసూదనాచారి అని తెలిపారు. ఈటల రాజేందర్ ఇప్పుడు గజ్వేల్‌కు వచ్చి మస్తు మాట్లాడుతున్నారని, ఆయన తిన్నింటి వాసాలు లెక్కపెట్టేటోడన్నారు. ఈటలకు గుర్తింపునిచ్చింది సీఎం కేసీఆరేనన్నారు. ఈటలను ఎమ్మెల్యే, మంత్రి, శాసన సభ పక్షనేతను చేసింది సీఎం కేసీఆరేనని, ఆ విషయాన్ని ఆయన మర్చిపోయాడన్నారు. అన్నం పెట్టిన చేతికి ఈటల సున్నం పెడుతున్నాడన్నారు. కరోనా సమయంలో బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఒక్కరైనా బయటకు వచ్చారా..? అంటూ మంత్రి ప్రశ్నించారు. ఈనెల 30 వరకే బీజేపీ, కాంగ్రెస్ నాయకులు కనిపిస్తారని, ఆ తర్వాత ఉండరని, కానీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులే మీ కండ్లముందు కనిపిస్తారని తెలిపారు. కేసీఆర్ గజ్వేల్‌కు ఒక వరమని, ఆయన్ను మరోసారి గెలిపిస్తే దక్షిణ భారతదేశంలో మొదటి హ్యాట్రిక్ సీఎంగా చరిత్రకెక్కి మరో గౌరవం గజ్వేల్‌కు దక్కుతుందన్నారు. విశ్వకర్మలు కోరుకున్నట్లు సిద్దిపేటలో మాదిరిగా గజ్వేల్‌లోనూ జయశంకర్ భవనాన్ని నిర్మించుకుందామన్నారు. సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం విశ్వకర్మల సంప్రదాయ వాయిద్యమైన రుంజను మంత్రి హరీశ్‌రావు వాయించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, ఆత్మకమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, కుకునూర్‌పల్లి సర్పంచ్ జయంతి నరేందర్, మర్కూక్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాల్‌రాజు, గజ్వేల్ పట్టణ యువత అధ్యక్షుడు స్వామిచారి, విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు వెంకట్‌చారి, ఉపాధ్యక్షులు వెంకటేశ్‌చారి, ప్రధాన కార్యదర్శి విఠల్‌చారి, నాగరాజుచారి, పల్లె పహాడ్ మాజీ సర్పంచ్ శ్రీనివాసాచారి, అరవిందాచారి, డాక్టర్ పెంటాచారి, డాక్టర్ వాసవాచారి, నాయకులు, విశ్వకర్మలు పాల్గొన్నారు.




సమ్మేళనానికి హాజరైన విశ్వకర్మలు

# బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 20 : కొండపాక మండలం ఖమ్మంపల్లిలో కాంగ్రెస్‌కు ఆ పార్టీ నాయకులు ఝలక్ ఇచ్చారు. ఎంపీటీసీ యాదగిరి, మాజీ సర్పంచ్ దామ శంకర్, మండల నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఖమ్మంపల్లి కాంగ్రెస్ నాయకులు సోమవారం మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి మంత్రి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కో–ఆర్డినేటర్ ర్యాగల దుర్గయ్య, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు అనంతుల నరేందర్, సీనియర్ నాయకులు అంబటి బాలచందర్‌గౌడ్, గొట్టె ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు..**

గజ్వేల్ అర్బన్, నవంబర్ 20 : గజ్వేల్ –ప్రజ్ఞాపూర్ మున్సిపల్ 4వ వార్డుకు చెందిన బీజేపీ నాయకులు కౌన్సిలర్ పంబాల అర్చనాశివకుమార్ ఆధ్వర్యంలో 30 మంది నాయకులు, కార్యకర్తలు సోమవారం మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.



కొండపాక : ఖమ్మంపల్లిలో కాంగ్రెస్ నాయకులకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి హరీశ్‌రావు



గజ్వేల్ అర్బన్ : బీజేపీ నాయకులకు కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి హరీశ్‌రావు